క్లుప్తంగా

వర్షాకాలం వ్యాధులతో అప్రమత్తం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి శ్యామ్

గొలుగొండ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు సోకే అవకాశం ఉంది కనుక వైదుల సలహాలు, సూచనలు పాటించాలని గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. చంద్రయ్యపాలెం గిరిజన గ్రామంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 40 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బురద నీటితో వడ్డాదివాసుల ఇక్కట్లు



వడ్డాదిలో కుళాయిల నుంచి వస్తున్న బురద నీరు

బుచ్చెయ్యపేట: మండలంలో గల మేజర్ పంచాయతీ వడ్డాదిలో కుళాయిల నుంచి బురదనీరు సరఫరా అయింది. వడ్డాది పెద్దేరు నదిలో మంచినీటి ట్యాంకు మోటారు ఉండటంతో వర్షం కురిసినప్పుడల్లా బురద నీరు వస్తోంది. బుధవారం పంచాయతీ కుళాయిల నుంచి బురదనీరు రావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కంచాలు, గ్లాసుల పంపిణీ

బుచ్చెయ్యపేట: మండలంలో పలు గ్రామాల్లో సీఎల్‌సీ చర్చి ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలు పాఠశాలకు చెందిన 300 మంది విద్యార్థులకు కంచాలు, గ్లాసులు పంపిణీ చేశారు. ఎల్‌బీ పురం, బంగారుమెట్ట గ్రామాల్లో ఐదుగురు మహిళలకు కుట్టుమిషన్లు అందించారు. బంగారుమెట్ట పాల కేంద్రం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన మంచినీటి బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజుతో పాటు పలువురు కూటమి నేతలు, ఇండోనేషియా దేశానికి చెందిన విదేశీయులు పాల్గొన్నారు.

ఎంఈవో-2 కృష్ణప్రసాద్‌కు సత్కారం

గొలుగొండ: గొలుగొండ మండల విద్యాశాఖ అధికారి-2గా నియమితులైన గాలి కృష్ణప్రసాద్‌ను మండల పీఆర్‌టీయూ యూనియన్ సభ్యులు బుధవారం సత్కరించారు. ఇటీవల ఎంఈవో-2గా ఏవీఎస్ఎస్ మూర్తి పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎంగా పని చేస్తున్న గాలి కృష్ణప్రసాద్‌ను జిల్లా విద్యాశాఖ అధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీరామమూర్తి, రమణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు శివకేశవరావు, రమేష్, లక్ష్మీనరసింహం మూర్తి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



వరినారును పరిశీలిస్తున్న ఏఈవో తదితరులు

మాడుగుల రూరల్: రెండు గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. జాలంపల్లి, ఎల్. పొన్నవోలు గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో స్థానిక మండల వ్యవసాయాధికారి ఎం. అనసూయ, సిబ్బంది పాల్గొన్నారు. వరినారుకు వచ్చే తెగుళ్ల, సస్యరక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ఖరీఫ్ వరినాట్లు వేసేటప్పుడు తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాలకు చెందిన వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుడి అరెస్ట్



పట్టుబడ్డ మచ్చరాజు

రోలుగుంట: గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న ముద్దాయి కిలో మచ్చరాజు (23)ని స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణారావు బుధవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి ఎస్ఐ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి జిల్లా చింతపల్లి మండలానికి చెందిన కిలో మచ్చరాజు మూడు మాసాల నుంచి తప్పించుకు తిరుగుతున్నాడని తెలిపారు. గాలించి పట్టుకున్న ఇతన్ని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచగా 14 రోజుల రిమాండు విధించినట్టు తెలిపారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించామని, ఎ-4గా ఉన్న మచ్చరాజు మాత్రం తప్పించుకు తిరుగుతూ బుధవారం పట్టుబడ్డాడని వివరించారు.

వాయిదాల పర్వం.. అసలెప్పుడు ప్రారంభం?

మూడుసార్లు వాయిదా పడ్డ పోలీస్‌స్టేషన్ల ప్రారంభోత్సవం

రెండు సంవత్సరాల నుంచి ఖాళీగా ఉన్న గొలుగొండ పోలీస్ స్టేషన్



ప్రారంభానికి నోచుకోని కృష్ణదేవిపేట పోలీస్‌స్టేషన్



రెండు సంవత్సరాల క్రితమే నిర్మించినా నేటికీ ప్రారంభం కాని గొలుగొండ పోలీస్ స్టేషన్

గొలుగొండ: స్థానిక పోలీస్ స్టేషన్ల ప్రారంభం కలగానే మిగులుతోంది. ఇప్పటికే మూడుసార్లు ప్రారంభ తేదీ ప్రకటించినప్పటికీ ఉన్నతాధికారుల రాక వాయిదా పడటం వల్ల పోలీస్ స్టేషన్ ప్రారంభం కావడంలేదు. కోట్లాది రుపాయలు ఖర్చు చేసి నిర్మించిన పోలీస్ స్టేషన్లు అలంకారప్రాయంగా దర్శినమిస్తున్నాయి. పోలీస్ స్టేషన్లు ప్రారంభం అయితే ఇటు పోలీస్ సిబ్బందికి, అటు ఇక్కడికి వస్తున్న ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉండేది.

మూడుసార్లు వాయిదా..

గొలుగొండ మండలంలోని కృష్ణదేవిపేట, గొలుగొండ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. సుమారు 60 వేల జనాభా కలిగిన ఈ మండలంలో ఈ రెండు స్టేషన్లు పూర్వం నుండి కొనసాగుతున్నాయి. ఇవి గతంలో మావోయిస్టు ప్రభావిత స్టేషన్లు కావడంతో ఇక్కడ ప్రత్యేక బలగాలు ఉండేవి. ఈ రెండు స్టేషన్లు నిర్మించి సమారు 20 సంవత్సరాలు కావడంతో కొత్త స్టేషన్లు మంజూరు చేశారు. గొలుగొండ స్టేషన్ నిర్మించి రెండు సంవత్సరాలు అవుతోంది. కృష్ణదేవిపేట స్టేషన్ ఆరు నెలల క్రితం నిర్మించగా ఇప్పటికి మూడుసార్లు ప్రారంభానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. కానీ నేటికీ మోక్షం కలగలేదు.

ఎన్నో హంగులతో నిర్మాణం..

ఈ రెండు స్టేషన్లలో అనేక అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయి. స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఏఎస్ఐలు, సిబ్బందికి విడివిడిగా ప్రత్యేక గదుల నిర్మాణం, ప్రతి గదికి కొత్త కంప్యూటర్లు, అలాగే ఫిర్యాదుదారులు, ముద్దాయిలకు ప్రత్యేక మరుగుదొడ్లు, వచ్చిన వారు వేచి ఉండడానికి ప్రత్యేక హాలు నిర్మించారు. ప్రభుత్వం ఒక్కొక్క పోలీస్ స్టేషన్ నిర్మాణానికి రూ. 2.50 కోట్లు మంజూరు చేసింది. ప్రతి సారి స్టేషన్ ప్రారంభానికి ఉన్నతాధికారులు తేదీ ప్రకటించడం.. స్థానిక పోలీసులు కొత్త స్టేషన్‌ను ముస్తాబు చేయడం.. కొత్తగా మొక్కలు నాటడం వంటి పనులు చేసేవారు. ఈలోగా స్టేషన్ ప్రారంభోత్సవం వాయిదా పడేది. అలా పలుమార్లు జరగడంతో ఈ పోలీస్ స్టేషన్ల ప్రారంభం ఎప్పుడో అని అంతా అనుకుంటున్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న అతిథులు

నర్సీపట్నం: అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు అల్లాడ సురేష్ బలిఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతూ వివిధ క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులకు 22 జతల దుస్తులను హెచ్ఎం కె.శ్రీదేవి చేతుల మీదగా అందజేశారు. ట్రస్టు నిర్వాహకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు సురేష్‌ను అభినందించారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.శ్రీదేవి, సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సందీప్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



కొత్తపెంటలో సర్వేలో పాల్గొన్న స్టేట్ సూపర్‌వైజర్ సుధీర్ తదితరులు

దేవరాపల్లి: గ్రామాల్లో పారిశుద్యం మెరుగు, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ లక్ష్యమని ఆ కార్యక్రమం స్టేట్ సూపర్‌వైజర్ జి. సుధీర్ అన్నారు. మండలంలోని కొత్తపెంటలో జరిగిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో ఉమాదేవితో కలిసి సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి మరుగుదొడ్లను వినియోగిస్తున్నారా లేదా, పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అని పరీక్షించారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి మంగపతి, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ వి.పి.వి. త్రినాథ్, ఎంఆర్‌సీ పైడిరాజు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రుల చెంతకు

నర్సీపట్నం:రోలుగుంట మండలం, ఎం.కె.పట్నానికి చెందిన 17 ఏళ్ల బాలిక కాలేజీకి వెళ్తానని చెప్పి, ఇంటికి రాకపోకవడంతో తల్లిదండ్రులు నర్సీపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎల్.రేవతమ్మ కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా నర్సీపట్నం నుండి విశాఖ వెళ్లినట్టు గుర్తించారు. సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది అమ్మాయి ఆచూకీ కనుగొని బుధవారం సీఐ సమక్షంలో అమ్మాయిని తల్లిదండ్రులకు అప్పగించారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్య సిద్ధి

కె.కోటపాడు: ధ్యానంతో ఆరోగ్య సిద్ధి అని గుంటూరుకు చెందిన పిరమిడ్ మాస్టర్ ప్రేమ్ అన్నారు. చౌడువాడలో ఆత్మజ్యోతి పిరమిడ్ కేంద్రంలో మంగళవారం రాత్రి నిర్వహించిన ధ్యాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ధ్యానం వల్ల కోపతాపాలు, ద్వేషం, ఉద్వేగం, శత్రుత్వం, ఈర్ష్య, అసూయ వంటివి దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్లు లిఖిత, మీనా, మనోహర్, నాగ అప్పారావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా.. ఇదెక్కడి న్యాయం?

మాడుగుల: ప్రతిపక్ష నేతగా చేసిన తప్పులను ఎత్తి చూపి ప్రశ్నిస్తే ఎంపీ, పార్లమెంటరీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడం తగదని కాంగ్రెసు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు అన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ అరెస్టుకు నిరసనగా స్థానిక పాత బస్టాండ్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు పార్టీ నాయకులతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఓట్ చోరీ కేసులో ప్రశ్నించినందుకు రాహుల్‌తో పాటు మరి కొంత మందిని అరెస్టు చేయడం బాధాకరమన్నారు. కాంగ్రెసు పార్టీ నాయకులు పి.రాంబాబు, ఎల్. అప్పారావు, గండి శంకరరావు, పిల్లా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంతో మళ్లీ జీవితం

నర్సీపట్నం: ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని నవ్య లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏబీఎం కాలేజీలో అవయవదాన ప్రాముఖ్యతపై సదస్సు జరిగింది. రీజినల్ చైర్‌పర్సన్ సీహెచ్ ఇందిర మాట్లాడుతూ ఒక వ్యక్తి తన మణం అనంతరం అవయవదానం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడిన వారవుతారన్నారు. క్లబ్ సెక్రటరీ బేతిరెడ్డి విజయ్ మాట్లాడుతూ అయవదానం, రక్తదానానికి మించిన దానాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ కర్రి రామ్‌గోపాల్, సభ్యులు సతీష్, దేవిప్రసాద్, సత్యనారాయణమూర్తి, కరస్పాండెంట్ ఎ.గిరిబాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర స్ఫూర్తి చాటుతూ తిరంగా యాత్ర



జాతీయ పతాకాలను ప్రదర్శిస్తున్న నర్సీపట్నం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, విద్యార్థులు, అధ్యాపకులు



వడ్డాదిలో జాతీయ జెండాలతో తిరంగా యాత్రలో పాల్గొన్న యువకులు



టి. అర్జాపురంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచన మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన ఇంటి మీద జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తి చాటుకోవాలన్నారు.

ముందస్తు స్వాతంత్య్ర దినోత్సవాలు..

నారాయణ స్కూల్‌లో ముందస్తు స్వాతంత్ర దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. చిన్నారుల విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. గాంధీ, నెహ్రూ, ఝాన్సీలక్ష్మీబాయి, సిపాయి వేషధారణలో చిన్నారులు అలరించారు.

వేడుకగా తిరంగా యాత్ర..

బుచ్చెయ్యపేట: మండలంలోని మేజర్ పంచాయతీ వడ్డాదిలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పలువురు నాయకులు జాతీయ జెండాలతో తిరంగా యాత్ర నిర్వహించారు. బుధవారం సాయంత్రం వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హై స్కూల్ నుండి నాలుగు రోడ్ల జంక్షన్, చెరుకు కాటా మీదుగా పలు వీధుల్లో జాతీయ జెండాతో హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించి దేశభక్తి చాటుకున్నారు. నాయకులు దొండా నానాజీ, దూది రాజేష్, దొండా నరేష్, దొండా సాయి తదితరులు పాల్గొన్నారు.

టి. అర్జాపురంలో..

రావికమతం: టి. అర్జాపురంలో బుధవారం మండల బీజేపీ అధ్యక్షుడు గుటాల చిన్న, కార్యదర్శి దంట్ల సత్యారావు, పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు, హైస్కూలు సిబ్బంది హర్ ఘర్ తిరంగా యాత్రలో పాల్గొన్నారు.

కె.కోటపాడులో..

• కె.కోటపాడు: కె.కోటపాడులో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమం జరిపారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి భారీ జాతీయ జెండాతో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్, మాజీ సర్పంచ్ అవుగడ్డ సోంబాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ చీపురుపల్లి అచ్చిబాబు, అయ్యన్న విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం: స్వాతంత్య్ర సమరయోధులను గుర్తు చేస్తూ ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాలను ఎగురవేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శీరం రెడ్డి సూర్యనారాయణ కోరారు. మండలంలోని తామరం నుంచి స్థానిక బస్టాండు వరకు జాతీయ జెండాలను చేతబట్టి బుధవారం హరఘర్ తిరంగా యాత్ర చేశారు. మూడు రోజుల పాటు అన్ని గ్రామాల్లోనూ హర్ ఘర్ తిరంగా యాత్ర చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మర్రి నాయుడు, నేతలు ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోలుగుంటలో..

రోలుగుంట: బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పచ్చిగోళ్ల ఈశ్వర్రావు బుధవారం మండల కేంద్రం రోలుగుంటలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.నాగమ్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులు మువ్వన్నెల జెండాలతో పోలీస్ స్టేషన్ మీదుగా ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి ఎమ్మార్వో కార్యాలయం మీదుగా తిరిగి జూనియర్ కాలేజీ చేరుకున్నారు. ప్రిన్సిపాల్ అప్పలరాజు, సీనియర్ అధ్యాపకుడు వసుదేవుడు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కె. సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులపై దృష్టి సారించాలి

నాతవరం: ఆధునిక సాగు పద్ధతులపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయశాఖ పాయకరావుపేట ఏడీ ప్రసాద్ అన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి సుగుణ ఆధ్వర్యంలో నాతవరంలో బుధవారం నిర్వహించిన రైతు సమావేశానికి హాజరయ్యారు. వ్యవసాయ శాఖలో అరకొర సిబ్బందితోనే ఖరీఫ్ సీజన్‌లో పని చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రైతులు సహకరించాలన్నారు. రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 122 మందికి నియామక పత్రాలు

దేవరాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దేవరాపల్లిలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. 257 మంది నిరుద్యోగులు హాజరు కాగా వీరిలో 122 మందికి ఆయా కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ నియామక పత్రాలు అందజేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్. గోవిందరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు, ఎంఈవో-1 సీహెచ్ ఉమ, కళాశాల ప్రిన్సిపాల్ బి. రాధ, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, పోతల పాత్రునాయుడు, కిలపర్తి భాస్కరరావు, పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు



అచ్చియ్యనాయుడు (ఫైల్)

గొలుగొండ: కృష్ణదేవిపేట గ్రామానికి చెందిన లోకవరపు అచ్చియ్యనాయుడు (32) వారం రోజుల నుండి కనిపించకపోవడంతో కటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తారకేశ్వరావు తెలిపారు. కృష్ణదేవిపేట (ఏఎల్‌పురం) గ్రామానికి చెందిన అచ్చియ్యనాయుడు విశాఖలో రియల్ ఎస్టేట్‌లో పని చేస్తున్నాడని, ఈనెల 6వ తేదీ రాత్రి ఇంటికి వస్తున్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. అయితే అతను ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. అతని కోసం కటుంబ సభ్యులు వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అచ్చియ్యనాయుడు ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 9440904240కి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

ఎరువుల షాపుల తనిఖీ

రావికమతం: ఎరువులు, పురుగు మందుల షాపుల్లో తప్పనిసరిగా ధరల పట్టిక ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎ. రమేశ్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో గల శ్రీనివాస ఫెర్టిలైజర్స్ జనరల్ స్టోర్, ఈశ్వర ఫెర్టిలైజర్స్ అండ్ జనరల్ స్టోర్లను పరిశీలించారు. షాపులకు సంబంధించిన లైసెన్స్, జీఎస్టీ కాపీలను షాపు ముందు ప్రదర్శించాలని, ఎట్టి పరిస్థితుల్లో ఏమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించకూడదన్నారు. అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైభవంగా విజయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



స్వామివారిని దర్శించకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు

మాడుగుల: స్థానిక గాంధీ పార్కు వద్ద వెలసిన విజయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవంతో పాటు స్వామి వారి విగ్రహ ప్రతిష్ట బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, ఆలయ నిర్వాహకులు కాకి శ్రీను, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ జవ్వాది వరహాలు, ఎడ్ల హేమంత్ కుమార్, పొలిమేర చిన్నారావు, అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

మత్తుపదార్థాల వినియోగంతో పెనుముప్పు



విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు



ఏఎల్‌పురం జెడ్పీహెచ్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ తారకేశ్వర్రావు

బుచ్చెయ్యపేట: నేటి యువత మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండల కేంద్రం బుచ్చెయ్యపేట జాజిమొగ్గల పాఠశాలలో నాషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనార్థాలు, మహిళలపై జరుగుతున్న దాడుల పై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాలు అమ్మినా, రవాణా చేసినా, నాటు సారా కాసి అమ్మినా పోలీసులకు సమాచారం అందించి సహకరించాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదనపు ఎస్ఐ భాస్కరరావు, ఏఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్లో..

గొలుగొండ: విద్యార్థులు చదువుపై దృష్టి సారించి మంచి భవిష్యత్ వైపు అడుగులు వేయాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వర్రావు తెలిపారు. ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా, శిశు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహితంగా నిలిపేందుకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెట్టుపల్లి జెడ్పీహెచ్ పాఠశాలలో..

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం, చెట్టుపల్లి జెడ్పీహెచ్ పాఠశాలలో సురక్షిత సమాజ నిర్మాణంలో యువతపాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై రాజారావు మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాలయం భూముల వేలం వాయిదా

నాతవరం: మండలంలో వి.బి. అగ్రహారంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ భూములకు బుధవారం నిర్వహించాల్సిన వేలం పాట వాయిదా వేశామని దేవదాయ శాఖ నర్సీపట్నం డివిజినల్ అధికారి సాంబశివరావు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమి కౌలు చేసేందుకు రైతులు రాకపోవడంతో వేలం పాట వాయిదా పడిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు ప్రకారం వేలం ఎప్పుడు నిర్వహిస్తామనేది తెలియజేస్తామన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి

మాడుగుల రూరల్: కె.జె.పురం పీఏసీఎస్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, సంఘ సభ్యుల అభ్యున్నతికి పాటు పడతానని కె.జె.పురం పీఏసీఎస్ చైర్‌పర్సన్ శరగడం ఆదిబాబు పేర్కొన్నారు. చెర్‌పర్సన్‌గా నియమితులైన ఆదిబాబు మరో ఇద్దరు డైరెక్టర్లు శ్రీనాథు శేఖర్, లెక్కల శ్రీనివాసరావుతో కలిసి బుధవారం సంఘం ఆవరణలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సంఘం పరిధిలో గల కె.జె.పురం, వంటర్లపాలెం గ్రామాలకు చెందిన సభ్యులకు అన్ని రకాల రుణాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సర్పంచ్ జామి రమణబాబు, పెద్దేరు జలాశయం చైర్మన్ అద్దిపల్లి జగ్గారావు, మండల దేశం పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు నందారపు సన్యాసిరావు, పుప్పాల రమేష్, స్థానిక నాయకులు రాపేట జోగినాయుడు, కాళ్ల నర్సింగరాజు, కాళ్ల అమ్మతల్లినాయుడు, వివిధ పీఏసీఎస్ చైర్‌పర్సన్లు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కూటమి నాయకులు, సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటల్లో విద్యార్థులు



చీడిగుమ్మలలో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ: ఆగస్టు 15 అంటే చిన్నారులకు పండగే. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహిస్తారు. అందులో భాగంగా బుధవారం విద్యార్థులకు కబడ్డీ, కోకో, తాడాట, క్రికెట్, పాటల పోటీలు నిర్వహించారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు..

మాడుగుల రూరల్: ఎంపీపీ, హైస్కూలు, గురుకుల పాఠశాలల్లో కబడ్డీ, కోకో, రన్నింగ్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్లు హెచ్ఎంలు తెలిపారు.

అల్లూరి జిల్లాలో 'మాడుగుల' విలీనం వాస్తవం కాదు

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి: మాడుగుల నియోజకవర్గాన్ని అల్లూరి జిల్లాలో విలీనం చేస్తున్నట్టు వస్తున్న వార్తలు వాస్తవం కాదని, అనకాపల్లి జిల్లాలో యథావిధిగా కొనసాగించేలా తన వంతుగా కృషి చేస్తానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. రైవాడ అతిథి గృహ ఆవరణలో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గతంలో జరిగిన జిల్లాలు, నియోజకవర్గాల పునర్విభజనపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఏడుగురు మంత్రులలో కూడిన ఉప సంఘాన్ని నియమించిందన్నారు. మాడుగులను అనకాపల్లి జిల్లాలోనే కొనసాగించే విధంగా సీఎం చంద్రబాబును, మంత్రివర్గ ఉప సంఘాన్ని కలిసి లేఖ అందజేస్తామన్నారు.

బకాయి బిల్లులపై సమీక్ష

2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ అభివృద్ధి పనుల బకాయి బిల్లులపై స్థానిక ఎమ్మెల్యే బండారు సమీక్ష నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నాలుగు మండలాల అధికారులు, అప్పట్లో పనులు చేసిన వారితో మాట్లాడి బిల్లులపై ఆరా తీశారు. రూ.86.96 లక్షల మేర పెండింగ్‌లో ఉన్న బిల్లుల విడుదలకు కృషి చేస్తానన్నారు.